## క్లుప్తంగా

### పాఠశాలల్లో నిధుల వినియోగంపై ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న విద్యా శాఖాధికారులు

టెక్కలి: టెక్కలి డివిజన్‌లో పలు ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఖర్చు చేసిన నిధులకు సంబంధించి సోమవారం టెక్కలిలో ఆడిట్ నిర్వహించారు. స్థానిక ఎంజేపీ ఏపీ పాఠశాలలో మండల విద్యా శాఖాధికారి డి.తులసీరెడ్డి పర్యవేక్షణలో డివిజన్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు.

### ఉపాధి పనుల పరిశీలన



చాకిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న షణ్ముఖ్‌కుమార్

టెక్కలి: ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ సోమవారం టెక్కలి మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. చాకిపల్లి గ్రామంలో నీటి గుంతలు, ఇంకుడు గుంతలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఈ నెల 22న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిర్వహించనున్న వర్చువల్ కార్యక్రమానికి సంబంధించి స్థానిక భవానీ థియేటర్‌ను పరిశీలించారు. ఈయనతో పాటు ఎంపీడీఓ సీహెచ్ లక్ష్మీబాయి, ఏపీడీలు శైలజ, రాధ, లోకేష్, ఏపీవో ప్రసాద్ ఉన్నారు.

### 21 మంది రక్తదానం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురం సచివాలయం వద్ద పూండి కేంద్రంగా సేవలందిస్తున్న యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో పలాసకు చెందిన ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పర్యవేక్షణలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో టెన్త్, ఇంటర్మీడియెట్ చదివి అత్యధిక మార్కులు సాధించిన కర్ని దరణి తదితరులకు నగదు, జ్ఞాపికలు, గోల్డ్ మెడల్స్ అందించి శాలువలతో సత్కరించారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి, ప్రతినిధులు కెంగువ రాంబాబు, సునీల్, కె.నారాయణరావు, ఎ.లక్ష్మణరావు, అపర్ణ పాల్గొన్నారు.

### స్నేహితుడికి ఆర్థిక సాయం



గిరధర్‌కు సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

ఇచ్ఛాపురం రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బాల్య స్నేహితుడుకి మిగిలిన మిత్రులు అండగా నిలిచారు. తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన కొన్నాయి గిరిధర్ ఈదుపురం పాఠశాలలో చదువుకున్నాడు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు రూ. 35 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని గిరిధర్‌కు సోమవారం అందజేసి ధైర్యం చెప్పారు.

### మున్సిపల్ గ్రీవెన్స్‌కు 10 వినతులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గపురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి పది వినతులు వచ్చాయి. వీటిలో మంచినీటి సౌకర్యం కల్పించాలని, జనన, మరణ సర్టిఫికెట్లు అందించాలని, వితంతు పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ వినతులు అందించారు. పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు.

# ప్రజలకష్టాలు తీరాయి!


- దాహం తీర్చుతున్న ఉద్దానం రక్షిత మంచినీటి పథకం
- గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం

పలాస:

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఉద్దానం ప్రాంతంలోని అనేక గ్రామాల ప్రజలు మంచినీటి కష్టాల నుంచి విముక్తి పొందుతున్నారు. హిరమండలం గొట్టా బ్యారేజీ నుంచి పైపులైన్ ద్వారా ఉద్దానం ప్రాంతానికి వస్తున్న రక్షిత మంచినీటి పథకం నీరు ప్రజల దాహార్తిని తీర్చుతోంది. పలాస మండలంలో ఉన్న 19 పంచాయతీల పరిధిలో 88 హేబిటేషన్ గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఈ పథకం ద్వారా 86 గ్రామాలకు నీటి సరఫరా అవుతోంది. జలజీవన మిషన్ నిధుల ద్వారా ఈ పనులు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పలాస మండలంలోని లొత్తూరు పంచాయతీ చింతవీధి, హల్దిగాం గ్రామాలకు మినహా మిగతా గ్రామాలకు నీటి కష్టాలు తప్పాయి. హిరమండలం నుంచి 80 కిలోమీటర్ల పొడవున పైపు లైను వేశారు. ఆ పైపులైన్‌ను ప్రతీ గ్రామానికి అనుసంధానం చేశారు. ఓవరు హెడ్ ట్యాంకుల్లేని గ్రామాలకు కొత్తగా ట్యాంకులు నిర్మించారు. అక్కడ నుంచి ప్రతి ఇంటికి కుళాయిలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. పలాస మండలంలోని మొత్తం 86 గ్రామాలకు ప్రస్తుతం 42 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా అవుతోంది. మిగతా గ్రామాలకు కూడా పైపు లైన్లు ఉన్నప్పటికీ ఇంటింటికీ కుళాయిలు వేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా ప్రస్తుతం కొనసాగుతోంది.



ఈదురాపల్లిలో ఏర్పాటు చేసిన కుళాయిలు



దానగురలో ఓవర్ హెడ్‌ట్యాంకు

### సక్రమంగా నీటిని అందించాలి



మా గ్రామానికి ఇంటింటికీ పైపు లైన్ వేశారు. అయితే కుళాయిలకు ట్యాపులు సరిగ్గాలేవు. దీంతో నీరు వృథా అవుతుంది. సమస్యను పరిష్కరించి నీటిని సక్రమంగా అందించాలి.

– బందారు గౌరమ్మ, మాకన్నపల్లి, పలాస మండలం

### పెండింగ్ పనులు పూర్తి చేస్తాం



పలాస మండలంలో ప్రతి గ్రామానికి పైపు లైన్ వేశాం. ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు వెళ్తుంది. అయితే కొన్ని గ్రామాలకు ఇంటింటి కుళాయిలు వేయాల్సి ఉంది. ప్రభుత్వం వీటి కోసం ఇటీవల రూ. 90 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ పనులన్నీ పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, పలాస

ఉద్దానం ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వడం ద్వారా అతి ప్రాణాపాయకరమైన కిడ్నీవ్యాధుల నుంచి రక్షించాలని గత ప్రభుత్వం హిరమండలం ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేయాలని సంకల్పించింది. ఇప్పుడు దీని ఫలాలు అందుతుండడంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమ లేఅవుట్ పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమసుందర్

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: నౌపడలో వేసిన అక్రమ లేఅవుట్‌ను తహసీల్దార్ హేమసుందర్ సోమవారం పరిశీలించారు. 'అంతా ఇష్టారాజ్యంగా' శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి స్పందించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ హేమసుందర్ లేఅవుట్ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 485 –3 కోర్టు పరిధిలో ఉందని, సర్వేనంబర్ 485–4కి ఎటువంటి అనుమతులు లేవని అన్నారు. లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈయనతో పాటు వీఆర్వో మంగులు, సచివాలయ సర్వేయర్ శివాజీ ఉన్నారు.

## రొయ్యల హేచరీపై చర్య తీసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ధనరాజు

సంతబొమ్మాళి: పాతమేఘవరంలో ఉన్న రొయ్యల హేచరీపై చర్య తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ హేమసుందర్‌కు మత్స్యకార నాయకుడు సూరాడ ధనరాజు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అటవీ భూముల్లో బోరు పైపులు, విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హేచరీ నుంచి విడుదలయ్యే కాలుష్యమైన జలాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారని.. దీంతో చేపల గుడ్లు పెట్టే సమయం కావడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. దీన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## పిడుగులపట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏడీ రవికృష్ణ

నందిగాం: గొర్రెలు, మేకల పెంపకందారులు పిడుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యశాఖ నందిగాం ఏడీ రవికృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని గొర్రెలు, మేకల పెంపకం దారులతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షం పడే సమయంలో ఆరుబయట ఉండకుండా సురక్షిత ప్రాంతానికి వెళ్లాలన్నారు. చెట్లు కిందకు వెళ్లవద్దని సూచించారు. తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, ఈఓపీఆర్డీ రాజారావు, నర్సిపురం పశువైద్యాధికారి మన్మథరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: పశువుల కాపరులు పిడుగులు, ఉరుములు వంటి విపత్కర పరిస్థితులు వచ్చినపుడు ఎలా బయట పడాలో తెలుసుకోవాలని కోటబొమ్మాళి ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ ఎస్.అప్పలరాజు, పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ సూచించారు. కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు, రైతులతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

### దళిత విద్యార్థిపై దాడి గర్హణీయం



బమ్మిడి సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: తిరుపతిలో ఇంజినీరింగ్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి గర్హణీయమని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం విద్యార్థి సంఘం అధ్యక్షుడు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కో–ఆప్షన్ మెంబర్ బమ్మిడి సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఇదొక ఉదాహరణ అన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### సూదికొండలో క్రికెట్ పోటీలు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండలో కొండమ్మతల్లి ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ పోటీలను ప్రారంభించారు. 19వ వార్డు పరిధి సూదికొండ పరిసర ప్రాంతం యువకులు ఐదు జట్లుగా ఏర్పడి టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. –కాశీబుగ్గ

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని వెలుగు, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మరావు అన్నారు. చిన్న బరంపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను పంటలకు వినియోగించాలని సూచించారు. సిబ్బంది లక్ష్మణరావు, మెట్ట మహేష్, గ్రామ సంఘం అధ్యక్షులు మెట్ట శారద, క్లస్టర కోఆర్డినేటర్ స్వామి నాయుడు, కృపా సింధు, లక్ష్మణరావు, బాలకృష్ణ, భరతి, నాగరాజు పాల్గొన్నారు. –మందస

### పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



ఖరీఫ్ పంటల సాగుకు ముందు పచ్చిరొట్టను సాగు చేయడం ద్వారా నేల సారవంతంగా మారుతోందని కవిటి మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి అన్నారు. మండలంలోని వివిధ రైతు సేవాకేంద్రాల పరిధిలో పచ్చిరొట్ట విత్తనాల సరఫరాను ఆమె సోమవారం పర్యవేక్షించారు. రైతు సేవాకేంద్రాల్లో జనుము, జీలుగ పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. –కవిటి

## క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కంచిలి: క్రీడా పోటీల నిర్వహణతో వివిధ ప్రాంతాల్లో ఉన్నటువంటి క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలు మెరుగుపడతాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మకరాంపురం గ్రామంలో స్థానిక విశ్వశాంతి యువజన సంఘం, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండా, క్రీడా జెండాలను ఆవిష్కరించారు. రూ. 80 వేలు సొంత నిధులతో సీనియర్ క్రికెటర్ మృత్యుంజయరావు ఏర్పాటు చేసిన సిమెంట్ వికెట్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నాయకులు నర్తు నరేంద్రయాదవ్, ఇప్పిలి క్రిష్ణారావు, కడియాల ప్రకాశ్, లడ్డు కేశవపాత్రో, గుమ్మిడి రామదాస్, పలికల జయరాం, డొక్కరి బలరాం, టీడీపీ నేతలు మాదిన రామారావు, జగ దీష్ పట్నాయక్, సీనియర్ క్రికెటర్ టి.వి.రమణ, విశ్వశాంతి యువజన సంఘం అధ్యక్షుడు గొండ్యాల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు బిరకట రమేష్ పాల్గొన్నారు.

## కిడ్నీ ఆస్పత్రిలో వైద్య సేవలందించాలని మంత్రికి వినతి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాసలోని కిడ్నీ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ను విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కిడ్నీ పరిశోధన కేంద్రానికి సంబంధించి పూర్తి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చాలని, వీలైనంత తొందరగా అన్నీ సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మంత్రినికి కలిసినవారిలో పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, పలాస నియోజకవర్గ నాయకులు కంచరాన బుజ్జి, పాట్నూరు తారకేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సింగుపురపు వెంకటరమణ ఉన్నారు.

### చినడోకులపాడులో సంబరాల సందడి



కోలాట ప్రదర్శనతో అలరిస్తున్న కళాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: చినడోకులపాడులో గ్రామ దేవత ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు అలరించారు. చిన్నారులు దేవతమూర్తుల వేషధారణతో అకట్టుకున్నారు. కోలాటం, అమ్మవారు, నాగిని తదితర నృత్యాలతో యువతి యువకులు అలరించారు. ఉత్సవాలను చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో గ్రామం జనసంద్రంగా మారింది.

## లైంగిక వేధింపులు నేరం



మాట్లాడుతున్న జడ్జి నిర్మల

టెక్కలి: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. లైంగిక వేధింపుల నివారణ చట్టంపై సోమవారం టెక్కలి కోర్టు సముదాయంలో న్యాయవాదులతో పాటు పారా లీగల్ వలంటీర్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు జరిగినా తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.గోవింద్, పి.మధుబాబు, ఎల్.బాలకృష్ణ, పారా లీగల్ వలంటీర్లు కె.గోపాలకృష్ణ, ఎం.సురేష్, కె.ఇంద్రతనయ, రాజేష్, ఈశ్వరరావు, నారాయణరావు, శంకర్‌రావు పాల్గొన్నారు.

## నేడు చిత్తడి నేలలపై ఫొటో ఎగ్జిబిషన్

సోంపేట: సోంపేట పట్టణంలోని లోకనాదీశ్వర కళాసీ సంఘ భవనం ప్రాంగణంలో మంగళవారం సోంపేట బీల (చిత్తడి నేలలు) జీవవైవిధ్యంపై ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బీల ప్రాముఖ్యతను అధికారులు, ప్రభుత్వానికి తెలియజేయడమే ఫొటో ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు.

### టెక్కలి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరుపతిరావు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గొంటి తిరుపతిరావు విధుల్లోకి చేరినట్లు కళాశాల సిబ్బంది సోమవారం తెలిపారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తిరుపతిరావు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

### నేడు అర్జునాపురంలో చింతామణి ఉత్సవం

కంచిలి: మండలంలోని అర్జునాపురం గ్రామంలోని చింతామణి గ్రామదేవత అమ్మవారి సంబర మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. అమ్మవారికి మంగళ వాయిద్యాలతో, పసుపు, సిందూర అలంకరణతో పూజలు చేస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

### ● సుందరయ్యకు ఘన నివాళి

భారత విప్లవోద్యమ పథ నిర్దేశకుడు, త్యాగశీలి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు ఆదర్శనీయమని వక్తలు అన్నారు. సోమవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య ఆశయాలను కొనసాగించాలన్నారు. సీఐటీయూ, సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



టెక్కలిలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

## రహదారులు మురుగు మయం!

- చిన్నపాటి వర్షానికే అస్తవ్యస్తంగా మారిన వైనం

టెక్కలి రూరల్: టెక్కలిలో సోమవారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికి మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. ప్రధానంగా ఎన్టీఆర్ కాలనీలో కొన్ని వీధుల్లో కాలువల్లేక, ఉన్న కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఇందిరా గాంధీ జంక్షన్ నుంచి నౌపడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ ఉన్నప్పటికీ చెత్తచెదారంతో నిండిపోయింది. ఫలితంగా కాలువలో ప్రవహించకుండా రోడ్లపైకి రావడంతో దుర్వాసతో అల్లాడిపోయారు. చిన్న బజార్ జంక్షన్ వద్ద సైతం మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. చిన్నపాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వర్షకాలంలో మరింత ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎన్టీఆర్ కాలనీలో రోడ్డుకి వచ్చిన మురుగునీరు



కాలువ నుంచి వచ్చిన మురుగు రోడ్డుపైకి చేరిన దృశ్యం



చిన్నబజార్ జంక్షన్ వద్ద రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు